

02

**కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్**

TGTEL/2026/A1889

# హైదరాబాద్ మిర్రర్

ప్రతి ఉదయం.. జన హృదయం

ఎడిటర్ & పబ్లిషర్ : మాకం గంగాధర్ సంపుటి : 01 సంచిక :65 05 శుక్రవారం, జూన్ 2026 వేల : 5/-



02

**ఇండియా కూటమికి బీటలు**

8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డిఎంకె

హాజరు కాబోవడం లేదని ప్రకటన విడుదల

Circulation : Hyderabad, Rangareddy, Nalgonda, Yadadri Bhuvanagiri, Suryapet, Mahabubnagar, Khammam, Nizamabad, Sangareddy, Adilabad

## పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

మీటింగ్‌కు అనుమతి ఎందుకు ఇవ్వలేదో చెప్పాలి

ఇంకా సెంటిమెంట్ రాజకీయాలతో మోసం చేస్తే ఊరుకోరు

బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల తీరుపై మండిపడ్డ బిజెపి అధ్యక్షుడు



హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా ఎప్పుడు మాట్లాడలేదని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు అన్నారు. ఆయన మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుందని రాంచందర్ రావు ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లో రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ సెంటిమెంట్‌ని మరోసారి రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు.

వివరాలు 2లో




కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో మంటలు

ఆస్తి, ప్రాణనష్టంపై అందని వివరాలు

రంగంలోకి దిగిన ఫైర్ ఇంజన్లు, పోలీసులు

అమీర్‌పేట-ఎస్సార్ నగర్ మధ్య ట్రాఫిక్ క్రమబద్దీకరణ

02

కొడంగల్ ఎత్తిపోతల ద్వారా

## లక్ష ఎకరాలకు సాగునీరు

- ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి రేవంత్ పరిశీలన
- త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



నారాయణపేట,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు అందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తెలిపారు. బీమా కృష్ణా నదులపై నిర్మించనున్న ప్రాజెక్టు పనుల పురోగతిపై గురువారం ముఖ్యమంత్రి బెంగుళూరు నుంచి నేరుగా మక్తల్ చేరుకోగా ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరిలకు జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఘన స్వాగతం పలికారు.

వివరాలు 2లో

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

- నేటి నుంచే అమల్లోకి పెంచిన రేట్లు
- రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం
- సబ్ రిజిస్ట్రార్ల అధికారాలకు కత్తెర
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.

వివరాలు 2లో

తెలంగాణ ఉద్యమకారులకు

## న్యాయం చేస్తాం

ఉద్యమకారుల సంఘాలను కలిసి వివరాలు సేకరిస్తాం

అఖిలపక్ష భేటీలో కమిటీ ఛైర్మన్ కేశవరావు

హైదరాబాద్,జూన్4 హైదరాబాద్‌మిర్రర్ ప్రతినిధి

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో ప్రత్యక్షంగా.. పరోక్షంగా పాల్గొన్న ఉద్యమకారులందరికి న్యాయం చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కె. కేశవరావు స్పష్టం చేశారు.

వివరాలు 2లో





## మమత పార్టీకి మరో షాక్

- బిధ్ధానగర్ మేయర్ కృష్ణాచక్రవర్తి రాజీనామా

కోల్‌కతా,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. బిధాన్నగర్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కృష్ణా చక్రవర్తి.. గురువారం తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారామె. రాజీనామా అనంతరం ఆమె మాట్లాడుతూ.. 'ఇది పూర్తిగా నా వ్యక్తిగత నిర్ణయం. 16 ఏళ్లుగా నేనీ బాధ్యతలు నిర్వర్తిస్తున్నాను.

వివరాలు 2లో



## పాలమూరు ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

పలు ప్రాజెక్టులను ఏరియల్ సర్వే చేసిన సిఎం

ప్రాజెక్టుల స్థితిగుతలపై అధికారులతో ఆరా




02

## రెండేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

- మంత్రులంతా ప్రజల్లోకి వెళ్లి చెప్పాలి
- కేబినేట్ భేటీలో సిఎంచంద్రబాబు సూచన

అమరావతి,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి అవుతున్న సందర్భంగా అందరూ ప్రజల్లోకి వెళ్లాలని మంత్రులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.

వివరాలు 2లో

ఎల్‌నినో ప్రభావంపై

## రైతులకు అవగాహన

వర్షాభావంపై సన్నద్ధం చేయండి

వ్యవసాయాధికారులకు మంత్రి తుమ్మల సూచన

హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి



వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు.

వివరాలు 2లో

# అమీర్‌పేటలో భారీ అగ్నిప్రమాదం

మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

హైదరాబాద్ అమీర్‌పేటలో గురువారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. శ్రీనివాసనగర్ వెస్ట్‌లో, మెట్రో పిల్లర్ నంబర్ - 1043 సమీపంలో ఉన్న కేఎస్సార్ ఫ్యాషన్స్ దుకాణంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదం కారణంగా మంటలు భారీగా ఎగసిపడ్డాయి. దీంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమించారు. మంటలు వేగంగా వ్యాపించకుండా ఉండేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. దట్టమైన పొగ కారణంగా పరిసర ప్రాంతాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలుస్తోంది. భవనంలో ఉన్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు కూడా కొనసాగాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. అగ్నిప్రమాదంలో ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం ఎంత మేరకు జరిగిందనే విషయంపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు 2చేసి దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా అమీర్‌పేట నుంచి ఎస్సార్ నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో పరిసర ప్రాంతాల్లో భారీ ట్రాఫిక్ జామ్ నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఇతర మార్గాల వైపు మళ్లిస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు అమీర్‌పేట- ఎస్సార్‌నగర్ మార్గాన్ని తాత్కాలికంగా నివారించి ప్రత్యామ్నాయ మార్గాలను ఉపయోగించాలని అధికారులు సూచించారు. అలాగే విధుల్లో ఉన్న ట్రాఫిక్, అగ్నిమాపక సిబ్బంది, ఇతర అత్యవసర సేవల సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం వివరాలు అధికారికంగా వెల్లడి కావాల్సి ఉంది.

మొదటిపేజీ తరువాయి

## కొడంగల్ ఎత్తిపోతల ద్వారా లక్ష ఎకరాలకు సాగునీరు

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఇరిగేషన్ ప్రాజెక్టులపై ఫోటో గ్యాలరీని ముఖ్యమంత్రి వీక్షించారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భీమా కృష్ణా నదులపై ప్రతిపాద బ్యారేజీ పనులు పురోగతికి సంబంధించిన ఫోటో ఎగ్జిబిషన్ ప్లాన్ మ్యాప్స్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించిన ఇరిగేషన్ అధికారులు. ÷ూష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి మక్తల్ మండలం కాట్రేవు పల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న మక్తల్ నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల ప్యాకేజ్ -1 పనులను గురువారం పరిశీలించారు. ప్యాకేజ్ -1 లో భాగంగా జరుగుతున్న పంప్ హౌస్ పనులు ఎంత శాతం పూర్తయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. కాంక్రీటు పనులను ప్రారంభించి వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి బోసు రాజు, జిల్లా మంత్రులు జూపల్లి కృష్ణారావు, డాక్టర్ వాకిటి శ్రీహరి, కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, ఇరిగేషన్ కార్యదర్శి శ్రీదర్, చీఫ్ ఇంజనీరు. ఏ సత్య నారాయణ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ హెచ్.టి శ్రీధర్, ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై గ్రామసభల్లో రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ఎ÷-లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

మొదటిపేజీ తరువాయి

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తాం

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు, గౌరవం కోసం కె. కేశవరావు అధ్యక్షతన ఏర్పాటైన కమిటీతో గురువారం హైదరాబాద్ సచివాలయంలో అఖిల పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశం అనంతరం కేకే మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉద్యమకారుల సంఘాలను మళ్లీ కలుస్తామని అన్నారు. అందుకోసం ఉద్యమకారులందరినీ పిలిచి మాట్లాడతామని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నదే తమ ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని వివరించారు. ఈ అఖిల పక్షం సమావేశంలో అన్ని పార్టీల నేతలు పాల్గొన్నారని చెప్పారు. విద్యార్థులతో, ఉద్యమకారుల సంఘాలతో అనుబంధం ఉన్న వారిని మళ్లీ కలుస్తామని కె.కేశవరావు తెలిపారు. ఉద్యమకారులందరిని పిలిచి మాట్లాడుతామన్నారు. తెలంగాణ తొలి దశతోపాటు మలి దశ ఉద్యమకారులందరికీ న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తుందని పేర్కొన్నారు. ఉద్యమకారులకు న్యాయం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అందుకోసం ఉద్యమకారులందరితోనూ మాట్లాడతామన్నారు. నష్టపోయిన అందరికీ న్యాయం చేస్తామని చెప్పారు. ఈ ప్రజా పాలన ప్రభుత్వం ఉద్యమకారులను గుర్తించడానికి ఏర్పాటు చేసిన కమిటీ.. అఖిలపక్ష పార్టీల నుంచి ఇద్దరి చొప్పున పిలిచామని పేర్కొన్నారు. పార్టీలు మాత్రమే కాకుండా ఉద్యోగ, విద్యార్థి, జర్నలిస్ట్, న్యాయవాదులు అందరినీ పిలిచి మాట్లాడతామని వివరించారు. కవులు, కళాకారులు తెలంగాణ సాధన కోసం పని చేసిన అందరిని గుర్తిస్తామన్నారు. ఈ పక్రియ అమరవీరుల ద్వీపంలో ప్రారంభమవుతుందని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారులకు గౌరవం ఇవ్వాలని, వారిని గుర్తించాలని, అలాగే అందరి నుంచి సూచనలు స్వీకరించాలని నిర్ణయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా సలహాలు, సూచనలు స్వీకరిస్తామని.. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విజ్ఞప్తులు స్వీకరిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. ఉద్యమ సమయంలో తన జీవితంలో యవ్వనం పోయిందని.. మమ్మల్ని ఆదుకోవాలని ఉద్యమకారులు కోరుతున్నారని ఎమ్మెల్సీ కోదండరాం తెలిపారు. అందుకోసం ఉద్యమకారుల జేఏసీలు ఉన్నాయని.. వారిందరినీ కలుస్తామన్నారు. అలాగే అన్ని యూనివర్సిటీల జేఏసీలు ఉన్నాయని.. వారితో కూడా సమావేశమవుతామని ఎమ్మెల్సీ కోదండరాం స్పష్టం చేశారు. ప్రజా సంఘాలు, కుల సంఘాలు, విద్యార్థి జేఏసీ, యూనివర్సిటీ జేఏసీలను సంప్రదిస్తామని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ వెల్లడించారు. అందరి సలహాలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఆలోచన అని చెప్పారు. స్టేక్ హోల్డర్స్‌ను పిలిచి మాట్లాడతామన్నారు. అందరి అభిప్రాయాలు తీసుకొని ఉద్యమకారులను గుర్తిస్తామని పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

## పవన్ కళ్యాణ్ తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారా?

తెలంగాణను వ్యతిరేకించిన ఎంఐఎంని ఎందుకు దగ్గరకు తీసుకున్నారని ప్రశ్నించారు. తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కళ్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు. ఆనాడు పార్లమెంటులో తమ పార్టీ మద్దతు ప్రకటించిందని అన్నారు. సుష్మా స్వరాజ్ బేషరతుగా మద్దతు ఇస్తేనే తెలంగాణ వచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు. ముమ్ముందు బిజెపి తెలంగాణలో కీలకంగా మారుతుందన్నారు.

మొదటిపేజీ తరువాయి

## మమత పార్టీకి మరో షాక్

ఎవరి పట్లా నాకే అసంతృప్తి లేదు. నిబంధనల ప్రకారమే రాజీనామా చేశా. నాకు నేను కొంత సమయం కేటాయించాలి అనుకుంటున్నాను. కౌన్సిలర్‌గా కొనసాగుతూ ప్రజలకు సేవ చేయదలచుకున్నాను' అని చెప్పారు. టీఎంసీ అధినేత్రి, మాజీ సీఎం మమతా బెనర్జీకి సన్నిహితురాలిగా ఉన్న కృష్ణా చక్రవర్తి తన రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు అందజేశారు. స్థానిక కార్పొరేషన్ అధికారులూ ఆమె రాజీనామా లేఖ అందిన విషయాన్ని ధ్రువీకరించారు. అలాగే రాష్ట్ర పురపాలక వ్యవహారాల శాఖ మంత్రి, అదనపు ప్రధాన కార్యదర్శికి కూడా లేఖ ప్రతులను పంపినట్లు అధికారులు తెలిపారు. ఆమె రాజీనామా ఆమోద పక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారం జరుగుతుందని స్పష్టం చేశారు. కాగా.. తృణమూల్ కాంగ్రెస్‌లో ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో కృష్ణా చక్రవర్తి నిర్ణయం బెంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. టీఎంసీకి సుదీర్ఘకాలంగా సేవలందించిన నేతగా, మమతకు అత్యంత సన్నిహితురాలిగా ఆమెకు పేరుండటంతో ఈ రాజీనామా ప్రాధాన్యం సంతరించుకుంది.

మొదటిపేజీ తరువాయి

## కార్మికులకు అండగా నిలిచేది బిఆర్ఎస్

హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై పోరాడేది గులాబీ జెండా మాత్రమేనని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ జలమండలి కార్యాలయం వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై ప్రసంగించారు. వాటర్ బోర్డులో 50 సంవత్సరాల లో ఎన్నడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం 650 మంది ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వాటర్ వర్క్స్ బోర్డు లోని ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై అవగాహన ఉన్న రాంబాబు యాదవ్‌ను 6 వ తేదీన జరిగే గుర్తింపు ఎన్నికలలో గెలిపించుకోవాలని తలసాని పిలుపునిచ్చారు. మున్సిపల్ శాఖను తన వద్ద పెట్టుకున్నముఖ్యమంత్రి రెండున్నర సంవత్సరాలలో ఒక్కసారైనా సమీక్ష చేశారా? అని తలసాని ప్రశ్నించారు.

మొదటిపేజీ తరువాయి

## ఇండియా కూటమికి బీటలు

## 8వతేదీ ఇండీ కూటమిని బహిష్కరించిన డిఎంకె

న్యూఢిల్లీ,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం తమిళనాడులో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఇండియా కూటమికి బీటలు వారాయి. ఇందులో భాగస్వామి అయిన డీఎంకే కీలక నిర్ణయం తీసుకుంది. జూన్ 8వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో జరిగే ఇండియా కూటమి సమావేశాన్ని బహిష్కరించాలని డీఎంకే నిర్ణయించింది. కాంగ్రెస్ పార్టీ పాల్గొనే ఈ భేటీకి వెళ్లే ప్రసక్తే లేదంటూ చెన్నైలోని డీఎంకే ప్రధాన కార్యాలయం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ తమకు తీవ్ర ద్రోహం చేసిందంటూ డీఎంకే సంచలన ఆరోపణలు చేసింది. కాంగ్రెస్ పార్టీ వైఖరితో డీఎంకే శ్రేణులు తీవ్ర మనస్తాపం చెందాయని వివరించింది. అందులో భాగంగా కేడర్ భావాలను గౌరవిస్తూనే ఇండియా కూటమి భేటీకి దూరంగా ఉండాలని ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ప్రకటనలో వివరించింది.

మొదటిపేజీ తరువాయి

## మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు

భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1200 నుంచి రూ.1400 కోట్ల మేర ఆదాయం వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రార్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసే అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. ÷ూను వచ్చాక ఏసీబీ ట్రాప్ ఆయిన్న ÷ల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసుకొని పని చేస్తానని పేర్కొన్నారు.÷-రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైనా తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

మొదటిపేజీ తరువాయి

## రెండేళ్ల కూటమి విజయాలపై ప్రజలకు వివరణ

గురువారం సీఎం అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తమ శాఖలో చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మంత్రులకు సూచించారు. గత ప్రభుత్వం నిర్వాకాలపై శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అప్పటి నుంచి ఈ రెండేళ్లలో ఏం చేశామో శాఖల వారీగా ఈనెల 28లోపు ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రైతులు పంట మార్పిడి విధానాన్ని అనుసరించాలని సీఎం చెప్పారు. దేశీయ, స్థానిక అవసరాల మేరకు పంటలు వేసే విధంగా రైతులను ఎడ్యుకేట్ చేయాలని అన్నారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు కేబినెట్ సబ్ కమిటీ ఎందుకు వేయలేదంటూ ఉన్నతాధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తున్నా ఎందుకిలా ఉన్నారని అధికారులపై సీరియస్ అయ్యారు. అగ్రిగోల్డ్ కేసులను వెంటనే పరిష్కరించేందుకు మొత్తం 31 కొత్త పోస్టులు మంజూరు చేసిన సీఎం.. వెంటనే కేబినెట్ సబ్ కమిటీని నియమించాలని ఆదేశాలు జారీ చేశారు. ఏపీలో16 వేల టీచర్ పోస్టులను భర్తీ చేశామని ముఖ్యమంత్రి తెలిపారు. డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్ రాద్ధాంతం చేస్తున్నారని.. ప్రజలను అయోమయానికి గురిచేయాలని చూశారని మండిపడ్డారు. 'మనం గట్టిగా తిప్పికొట్టడంతో ఇప్పుడు తోక ముడిచారు. మనం చెప్పేది వివరంగా ప్రజలకు తెలియజేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలకు తెలుస్తుంది' అని వివరించారు. ఇటీవల రాజధానిలో కొంతమంది రైతులను జగన్ కలిశారని సీఎం చెప్పగా.. జగన్ దగ్గరకు వెళ్లిన అశోక్ అనే రైతు నిన్న నేలపాడులో తన భూమిని ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చారని మంత్రి నారాయణ తెలిపారు. రైతులను జగన్ గందరగోళంలోకి నెట్టాలని ప్రయత్నం చేస్తున్నారని.. కానీ రాజధాని రైతులు ఇప్పుడు కూడా జగన్ మనస్తత్వాన్ని అర్థం చేసుకున్నారని సీఎం అన్నారు. జగన్ చెప్పిన మాటలను నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. ప్రజలకు నిజాలు వివరిస్తే వాళ్లు పూర్తిగా అర్థం చేసుకుంటారన్నారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నంలో యోగా డే నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

మొదటిపేజీ తరువాయి

## పాలమూరు ప్రాజెక్టులపై సిఎం రేవంత్ సమీక్ష

మహబూబ్‌నగర్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అన్ని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమశిలలో ఉన్నతస్థాయి సమీక్ష చేపట్టారు. మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. జిల్లా పరిధిలోని కీలక సాగునీటి ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా ఏరియల్ సర్వే నిర్వహించారు. ముఖ్యమంత్రి , మంత్రుల బృందం పాలమూరు జిల్లాలోని పలు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ఆకాశ మార్గం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించింది. ముఖ్యంగా కోయిల్ సాగర్ ప్రాజెక్టు, కృష్ణా-భీమా నదులపై ప్రతిపాదించిన నూతన బ్యారేజీల స్థలాలు, , జూరాల ప్రాజెక్టు డ్యామ్‌ను సీఎం రేవంత్ రెడ్డి వీక్షించారు. ప్రాజెక్టుల ప్రస్తుత స్థితిగతులు, నీటి నిల్వ సామర్థ్యం తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి తన సొంత నియోజకవర్గ పరిధిలోని కొడంగల్ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని ప్రత్యేకంగా పరిశీలించారు. ఈ పథకంలో అత్యంత కీలకమైన కాట్రేవుపల్లి పంప్ హౌస్ వద్ద జరుగుతున్న పనుల నిర్మాణ శైలిని, పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా వీక్షించారు. ఈ ప్రాంతానికి సాగునీరు అందించడంలో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుండటంతో దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తోంది. ఏరియల్ సర్వే అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడారు. పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల పనులన్నింటినీ యుద్ధప్రతిపాదికన వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎలాంటి జాప్యం లేకుండా, నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంత్రుల బృందం కూడా ప్రాజెక్టుల వారీగా ఉన్న అడ్డంకులను తొలగించి, పనులను త్వరగా ముగించాలని అధికారులకు సూచించింది.

## ప్రజాపాలనలో 5వ వార్డ్ సుభాష్‌నగర్ సమస్యలపై సానిటరీ ఇన్స్పెక్టర్ వసంత్ కు వినతిపత్రం

## మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

- అధికారుల తక్షణ స్పందన కోరిన బస్తీ వాసులు

మందమర్రి జూన్ 4: హైదరాబాద్ మిర్రర్

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా 5వ వార్డు సుభాష్‌నగర్‌లో నెలకొన్న పలు ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సీపీఐ,కాంగ్రెస్ నాయకులు మరియు బస్తీవాసుల ఆధ్వర్యంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ వసంత్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సుభాష్‌నగర్‌లో ప్రతిరోజూ మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరా చేయాలని, నూతన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని,పారిశుధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని కోరారు. అలాగే చెత్త ట్రాలీ ప్రతిరోజూ బస్తీలో తిరిగేలా చర్యలు తీసుకోవాలని,పిచ్చి మొక్కలను తొలగించాలని, పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా కోతుల బెడదతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వాటి నివారణకు చర్యలు చేపట్టాలని, వీధి దీపాలను ఏర్పాటు చేయాలని,చెడిపోయిన బోర్‌వెల్‌లను మరమ్మతు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి గోపి,సీపీఐ యువజన నాయకులు వంశీకృష్ణ,సంజయ్, కళ్యాణ్‌రామ్,చెర్రీ,కాంగ్రెస్ బీ సి సెల్ అధ్యక్షులు మాంతు రవి,నాయకులు ఆల్క పున్నం తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో బస్తీవాసులు హాజరై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.



## కొండ సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలి

బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)



జైశ్రీరామ్ అంటే డబ్బులు పడతాయా అంటూ హిందూ దేవుళ్లను అవమానించే విధంగా మాట్లాడిన దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖ ఏవిధంగా చర్చిలో ఏర్పాటు చేసుకున్న సౌండ్ సిస్టమ్ ను ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నిస్తూ కొండ సురేఖను వెంటనే మంత్రి పదవి నుండి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేసిన రాష్ట్రీయ హిందూ ధర్మరక్షణ సంస్థ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులు. నిధుల కేటాయింపు లేక చారిత్రక ప్రాధాన్యత కలిగి ఆధ్యాత్మికతను పంచుతున్న ఆలయాల నిర్వాహణకు, పూజారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని హిందూ దేవాలయాల ద్వారా ఆదాయం పొందుతున్న దేవాదాయ ధర్మా శాఖ హిందూ దేవాలయలపై తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయని తెలిపారు.

## మునిపల్లి, కంకోల్ పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:

జిల్లాలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. కె. లలితాదేవి సూచించారు. గురువారం మునిపల్లి, కంకోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు రిజిస్టర్లను పరిశీలించి, విధులకు సమయానికి హాజరవుతున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. అనంతరం ఆసుపత్రులలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. మందుల నిల్వలను తనిఖీ చేసిన డీఎంహెచ్‌వో, గడువు ముగిసిన మందులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిల్వ ఉంచరాదని ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులను ఉచితంగా, సకాలంలో అందించాలని సూచించారు. వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్య అధికారులతో సమావేశం నిర్వహించి, ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించి శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు.





# మహిళా డిక్లరేషన్ హామీల అమలుకు పోరాటం కొనసాగిస్తాం

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి

కనగల్,జూన్ 04(హైదరాబాద్ మిర్రర్):

నల్లగొండ జిల్లా, కనగల్లు మండలం తుర్కపల్లి గ్రామంలో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆధ్వర్యంలో మహిళా డిక్లరేషన్ అమలు, మహిళల సమస్యలు, సంక్షేమ పథకాలపై సమగ్ర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ములుగు మహిళా డిక్లరేషన్ పేరుతో మహిళలకు అనేక హామీలు ఇచ్చిందని, అయితే వాటిలో చాలా వరకు ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు ₹2,500 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఆ హామీని అమలు చేయలేదని అన్నారు. అలాగే మహిళలకు వడ్డీ లేని రుణాలు అందిస్తామని చెప్పినప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఇప్పటికీ అధిక వడ్డీలకు అప్పులు తీసుకునే పరిస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయాల్లో మహిళలకు 25 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ఇచ్చిన హామీ కూడా అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. చదువుకున్న విద్యార్థినులకు ల్యాప్‌టాప్‌లు, స్కూటీలు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ విషయంపై కూడా చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళలను లక్షాధికారులుగా చేస్తామని చెప్పి, మహిళా సంఘాలకు తగిన ఆర్థిక సహాయం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కల్యాణలక్ష్మి, తులం బంగారం వంటి హామీల అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహిళా డిక్లరేషన్‌లో ప్రకటించిన పథకాల అమలుకు అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించకుండా హామీలను ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు. మహిళల సమస్యలు,



సంక్షేమ పథకాల అమలు, ఆర్థిక సాధికారత కోసం జిల్లావ్యాప్తంగా సమగ్ర సర్వేలు నిర్వహించి, అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా అమలు చేసే వరకు ఐద్వా ఆధ్వర్యంలో ఉద్యమాలు, పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె. సుల్తానా, మహిళా నాయకురాళు ఆదిమల్ల మారెమ్మ, బయలు యాదమ్మ, మీనమ్మ, లక్ష్మి, ప్రశాంతి, దుర్గమ్మ, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై జోనల్ కమిషనర్ కి వినతి పత్రం

బాలాపూర్ (హైదరాబాద్ మిర్రర్)

గ్రేటర్ హైదరాబాద్ శంషాబాద్ జోన్ బడంగ్పేట్ సర్కిల్ 60వ డివిజన్ దాతునగర్, సాయిగణేష్ నగర్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, సాయి కృప కాలనీ, జయభారత్ నగర్ ఆఫీసర్స్ కాలనీలలో గుంతలుగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలని, పార్క్ ఏరియా లో పండగల ఉత్సవాల కొరకు షెడ్ నిర్మాణం చేపట్టాలని, వీధి దీపాలు ఏర్పాటు, దోమల నివారణకు ఫాగ్ చేయాలని, తదితర అభివృద్ధి పనులు చేపట్టాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్రనేత కోలను శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో బిజెపి శ్రేణులు ఎంపీ ఈటల రాజేందర్ ఇచ్చిన వినతి పత్రాన్ని శంషాబాద్ జోనల్ కమిషనర్ కు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు సత్యప్రకాష్ జీ, గంగవరం సురేష్, జై కాంత్ గుప్తా, దినేష్ , తదితరులు పాల్గొన్నారు.



## వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు ప్రజలకు అదనపు కలెక్టర్ సూచన

జగిత్యాల,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సారంగాపూర్ మండలంలోని సారంగాపూర్, బట్టపల్లి, పోతారం, నాయకపు గూడెం, బీర్పూర్ మండలంలోని బీర్పూర్, నర్సింహులపల్లి, తుంగూర్, కందేనకుంట గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు గురువారం నిర్వహించారు. బీర్పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతు గ్రామాల్లో వర్షాకాలంలో పారిశుద్య నిర్వహణపై ఆ చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో ముందస్తు ప్రణాళికలు, పారిశుద్య నిర్వహణ, ఎలినినో ప్రభావ పరిస్థితుల్లో రైతులు పంటల మార్పిడీ చేసుకోవడం, మ చర్యలు, గ్రామాల్లో ఇంకుడు గంతల నిర్మాణాల ఏర్పాటు, నీటిని పొదుపుగా వాడుకోవడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో వివిధ అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సమావేశాల్లో బీర్పూర్ మండల ప్రత్యేక అధికారి ప్రకాష్, తహసీల్దార్లు వహిదొద్దిన్, సుజాత, ఎంపీడీఓలు ఎండి సలీం, భీమేష్ ప్రజాప్రతినిధులు చేకూట ఆరుణ శేఖర్, మర్రిపెల్లి అశ్విని, పుష్పనాథ్, మల్యాల జ్యోతి, ఎలమట్ల హరీష్, ఎడ్ల సృజన సుశీన్, హర్షకోట రాజగోపాల్ రావు, కొమిరే నర్సయ్య, ఆయా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దు ఆంధ్రా నాయకులకు గుత్తా కౌంటర్

హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి

తెలంగాణలో విద్వేషాలు సృష్టించవద్దని తెలంగాణ మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ నాయకులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకలు జరుగుతుంటే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభను నిర్వహిస్తామనడం సరైనది కాదని మీడియా చిట్‌చాట్‌లో పేర్కొన్నారు. మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ వాడిన భాష తీరు సరిగా లేదని వెల్లడించారు. అమరావతి బ్రహ్మండమైన రాజధాని అంటున్న సీఎం ,డిప్యూటీ సీఎం , మంత్రులు అమరావతిలోనే నివాసం ఉండాలని సూచించారు. తెలంగాణ కన్నా ఏపీలో ఎక్కువ సోర్స్ ఉన్నాయి. సముద్ర తీరం ఉంది. రకరకాల పోర్టులు ఉన్నాయి. ఆ నాయకులంతా ఏపీ అభివృద్ధి చూసుకోవాలి తప్ప తెలంగాణా వైపు చూడొద్దని హితవు పలికారు. తెలంగాణలో విద్వేషాలకు ప్రయత్నించవద్దని తెలిపారు. తెలంగాణ లో 75 శాతం ధాన్యం సేకరణ పూర్తి అయిందని, ధాన్యం కొనుగోళ్లకు కేంద్రం సహకరించడం లేదని ఆరోపించారు. రైతులు పంట మార్పిడి వైపు దృష్టి సారించాలని కోరారు. రైతులు వరి , పత్తి తప్ప ఏ పంటలు పండించడం లేదని వివరించారు.

## సామాజిక ఉద్యమాల్లో భాగస్వాములు కావాలి

- బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్

హైదరాబాద్ మిర్రర్, ఎల్ బి నగర్ :

సామాజిక ఉద్యమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీసీ ప్రభంజనం సమన్వయకర్త టియుడబ్ల్యుజె రాష్ట్ర నాయకులు జాల కిషన్ పిలుపునిచ్చారు. బీసీ ప్రభంజనం కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ జన్మదిన వేడుకలు కొత్తపేట బీజెఆర్ భవన్ లో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ ఈబీసీ ఉద్యమాలు రాజకీయాలకు అతీతంగా కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా ఉందని టియుడబ్ల్యుజె జాతీయ నాయకులు ప్రవీణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. రాజకీయ చైతన్యం అధికంగా ఉండే ఎల్బీనగర్ ప్రాంతంలో తెలంగాణ మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున జరిగింది అని టియుడబ్ల్యుజె జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ అన్నారు. ఉప్పు సత్యనారాయణ సేవలు ముందు ముందు యదావిధిగా కొనసాగించాలని తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్త పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా బీసీ ఉద్యమాన్ని ముందుకు తీసుకు పోతున్న ఉప్పు సత్యనారాయణకు పలువురు ప్రముఖులు జన్మదిన వేడుకలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాచం సత్యనారాయణ గుప్త, వివిధ దిన పత్రికల ఇంచార్జులు కిషన్, ప్రవీణ్ కుమార్, మేకల సత్యనారాయణ, దశరథ్ గౌడ్, శేఖర్, సురేందర్, తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిండిగ అలియాస్ తెలంగాణ వెంకన్న, సోషల్ జస్టిస్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు పిడికిలి రాజు, రాష్ట్ర ఇంచార్జి కె వి గౌడ్, టియుడబ్ల్యుజె జిల్లా నాయకులు తగరం సత్యనారాయణ, ఎల్బీనగర్ నియోజకవర్గం టియుడబ్ల్యుజె ఎల్బీనగర్ అధ్యక్షుడు సైదులు, టియుడబ్ల్యుజె ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ టియుడబ్ల్యుజె జిల్లా నాయకులు సుభాష్, శ్యామ్ బీసీ ఉద్యమ మహిళా నాయకురాలు ఉపేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## ఎస్టీ నిరుద్యోగ యువతకు జూన్ 6న నైపుణ్యాభివృద్ధి శిబిరం

జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి బి. వెంకటేష్

సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:



జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఎస్టీ నిరుద్యోగ యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు జూన్ 6న ఉదయం 11 గంటలకు సంగారెడ్డి ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఒకరోజు నైపుణ్యాభివృద్ధి అవగాహన, ప్రేరణ శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి బి. వెంకటేష్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 114 మంది ఎస్టీ నిరుద్యోగ యువతను లక్ష్యంగా చేసుకుని నిర్వహిస్తున్న ఈ శిబిరంలో నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాలపై అవగాహన కల్పించనున్నారు. అగ్రికల్చర్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, అగ్రికల్చర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్, టూరిజం అండ్ హాస్పిటాలిటీ స్కిల్ కౌన్సిల్, ఎన్ఐ-ఎంఎస్ఎంఈ తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొని శిక్షణ కార్యక్రమాల వివరాలు అందించనున్నారు. అర్హత కలిగిన ఎస్టీ నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# వరద నీటి మళ్లింపునకు ప్రత్యేక ప్రణాళికలు చేపట్టాలి

## - మున్సిపల్ అధికారులకు కాలనీవాసుల వినతి

## - ప్రగతినగర్‌లో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ పర్యటన





**కుత్బుల్లాపూర్, జూన్ 04 (హైదరాబాద్ మిర్రర్):**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ ప్రగతి నగర్ కమాన్ వద్ద చేపడుతున్న వరద నీటి పైప్‌లైన్ పనులను కుత్బుల్లాపూర్ జోన్ మున్సిపల్ కమిషనర్ పింకేష్ కుమార్ గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని స్థానిక సమస్యలపై అధికారులు, కాలనీవాసులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సాధారణ డ్రైనేజీ పైప్‌లైన్లలోకి వరద నీటిని కలపకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా స్థానిక కాలనీవాసులు అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఒకవేళ వరద నీటిని డ్రైనేజీ పైప్‌లైన్లలో కలిపితే.. వర్షాలు పడినప్పుడు ఒత్తిడి తట్టుకోలేక డ్రైనేజీలు పొంగిపొర్లుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల సాయికృష్ణ కాలనీ, చందు లేఔట్, ఎన్ఆర్ఐ కాలనీలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు తీవ్రంగా ముంపునకు గురవుతాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గతంలో వచ్చిన వరద ముంపు వల్ల అపార్ట్‌మెంట్‌లలోకి నీరు చేరి అనేక కష్టాలు పడ్డామని స్థానికులు గుర్తు చేశారు. తాగునీరు కలుషితమవ్వడం, సెల్లార్లలో నిలిచిన నీటి కారణంగా కార్లు, వాహనాలు పూర్తిగా దెబ్బతినడంతో అటు ఆరోగ్యపరంగా, ఇటు ఆర్థికంగా తాము తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చేదు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, వరద నీటి మళ్లింపునకు డ్రైనేజీతో సంబంధం లేకుండా శాశ్వత ప్రాతిపదికన ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని కోరారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో జోనల్ కమిషనర్‌తో పాటు నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సాబీర్ అలీ, ఏఈ ప్రవీణ్ కుమార్, ఇతర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బొట్ల తిరుపతి, శరత్ రెడ్డి, దారుకోల్ శ్రీనివాస్, సురేష్, తిరుపతి రెడ్డి, హరీష్, సాయి, రమేష్, విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొని అధికారులకు క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను వివరించారు.

# రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో విజయవంతమైన మోకాలి మార్పిడి శస్త్రచికిత్స

## నాణ్యమైన వైద్య సేవలందిస్తున్న సింగరేణి వైద్య బృందం

**రామకృష్ణాపూర్ జూన్ 4:హైదరాబాద్ మిర్రర్**

రామకృష్ణాపూర్‌లో అరుదైన వైద్య సేవ విజయవంతంగా అందించబడింది.ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగానికి చెందిన డాక్టర్ విక్రమ్,డాక్టర్ నరేష్, అనస్తీషియా విభాగానికి చెందిన డాక్టర్ మధుకర్,డాక్టర్ రామ్ మైత్రి,ఓటీ విభాగం ఇన్‌చార్జి సిస్టర్ జ్యోతి ఆధ్వర్యంలో ఒక రోగికి మోకాలి మార్పిడి (క్నీ రీప్లేస్‌మెంట్) శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు.అత్యంత నైపుణ్యంతో వైద్య బృందం ఈ శస్త్రచికిత్సను నిర్వహించగా,ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి వేగంగా కోలుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) ఎం.మధుకుమార్ మాట్లాడుతూ,శస్త్రచికిత్సలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన అత్యున్నత నాణ్యత గల స్ట్రైకర్ ఇంప్లాంట్స్‌ను ఉపయోగించడం జరిగిందని తెలిపారు.సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు,అలాగే పరిసర ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ఆసుపత్రి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆధునిక వైద్య పరికరాలు, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమిష్టి కృషితో ఏరియా ఆసుపత్రిలో వివిధ ప్రత్యేక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయని తెలిపారు.భవిష్యత్తులో మరింత మెరుగైన వైద్య సేవలను ప్రజలకు అందించేందుకు ఆసుపత్రి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ విజయవంతమైన శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరియు ఇతర సిబ్బందిని డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ (అడ్మిన్) ఎం. మధుకుమార్ అభినందించారు.




# తార కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

రేపటిలోపు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలి
తారా కళాశాలలో విభిన్న డిగ్రీ కోర్సులు
ఉపాధి అవకాశాలకు ప్రత్యేక కోర్సులు
అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య
ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలకు ప్రాధాన్యం
ఆధునిక ల్యాబ్‌లు, కంప్యూటర్ సదుపాయాలు
విద్యార్థులకు జిమ్, గ్రంథాలయ వసతులు
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్కాలర్‌షిప్‌లు
బాలికలకు ప్రత్యేక ఆర్థిక సహాయం
రాష్ట్రంలోని ఉత్తమ కళాశాలల్లో తారా ఒకటి
జూన్ 15తో ముగియనున్న ప్రవేశ ప్రక్రియ
సందేహాల నివృత్తికి కళాశాల సందర్శించాలని సూచన
డిగ్రీ చదవాలనుకునే వారికి తారా కళాశాలే తొలి ఎంపిక
కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:**

తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డిలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం దోస్త్ మూడో దశ అడ్మిషన్లు కొనసాగుతున్నాయని, ఇది విద్యార్థులకు చివరి అవకాశమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ప్రవీణ తెలిపారు. దోస్త్ రెండో దశలో సీట్లు పొందిన విద్యార్థులు తమ సీట్లను ఖరారు చేసుకోవడానికి రేపటిలోపు ఆన్‌లైన్ కేంద్రాలు లేదా మీ సేవ ద్వారా సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేయాలని సూచించారు. లేకపోతే వారి సీట్లు రద్దయ్యే అవకాశం ఉందన్నారు. కళాశాలలో బీఏ, బీఎస్సీ లైఫ్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్, బీసీఏ, బీబీఏ, బీకాం కంప్యూటర్స్‌తో పాటు ఉపాధి అవకాశాలను పెంచే బీకాం, బీఎఫ్ఎస్ఐ, బీకాం హెచ్ఆర్, బీబీఏ, రిటైలింగ్, బీ ఫార్మసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ద్వారా నాణ్యమైన విద్య అందిస్తున్నామన్నారు. విద్యార్థులకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, క్రీడలు, ఆధునిక ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, జిమ్, విస్తృత గ్రంథాలయ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థులకు ప్రభుత్వ స్కాలర్‌షిప్‌లు లభిస్తాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన బాలికలకు అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ ద్వారా సంవత్సరానికి రూ.30 వేల స్కాలర్‌షిప్, అలాగే మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్ కింద రూ.10 వేల వరకు ఆర్థిక సహాయం అందుబాటులో ఉందన్నారు. దోస్త్ మూడో దశ అడ్మిషన్ల ప్రక్రియ ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతుందని, విద్యార్థులు తారా ప్రభుత్వ కళాశాలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపల్ కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే నేరుగా కళాశాలను సంప్రదించాలని సూచించారు.



# సంగారెడ్డి నూతన డీఈఓను కలిసిన బీఆర్ఎస్వీ నాయకులు

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:**

సంగారెడ్డి జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారి గా బాధ్యతలు స్వీకరించిన రోహిణిని బీఆర్ఎస్వీ నాయకుడు అఖిల్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అఖిల్ మాట్లాడుతూ.. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతంతో పాటు విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు బత్తుల విక్రమ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# డివిజన్ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు: ఎమ్మెల్యే జీఎంఆర్

## కర్దనూరులో సీసీ రోడ్డు, తెల్లాపూర్‌లో రూ.87 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన







**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి జూన్ 04:**

పటాన్‌చెరు నియోజకవర్గంలోని డివిజన్ల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయిస్తూ మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం ముత్తంగి డివిజన్ పరిధిలోని కర్దనూరు గ్రామం సిద్దార్థ కాలనీలో రూ.65 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, అలాగే తెల్లాపూర్ డివిజన్‌లో హుడా కమాన్ నుంచి రేడియం రోడ్డు వరకు ప్రధాన రహదారి మీడియన్, పాత్‌వే నిర్మాణం కోసం రూ.87 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలోని తొమ్మిది డివిజన్లలో మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నామని తెలిపారు. డివిజన్ల సమగ్ర అభివృద్ధి కోసం ఇటీవల మున్సిపల్ కమిషనర్ సృజనను కలిసి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. అతి త్వరలో ప్రతి డివిజన్ అభివృద్ధికి అదనపు నిధులు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న కొత్త కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. తెల్లాపూర్ ప్రాంతంలో వరద నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, సోమిరెడ్డి, దేవేందర్ యాదవ్, కుమార్, మాజీ కౌన్సిలర్లు లచ్చిరామ్ నాయక్, బాబ్జి, శ్రీశైలం, శ్రీకాంత్, ఉమేష్, రవీందర్ రెడ్డి, నాగరాజు, ఇంజినీరింగ్ విభాగం డీఈ కృష్ణవేణి, ఏఈ ఫైజన్, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గుండమల్ల చంద్రయ్య మృతికి నివాళులర్పించి ఆర్థిక సాయం అందజేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, జూన్ 04(హైదరాబాద్ మిర్రర్):**

యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం కేంద్రానికి చెందిన గుండమల్ల చంద్రయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. వారి మరణ వార్త తెలుసుకొని వారి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి వారి కుటుంబానికి 5000/- రూపాయల ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు మందుగుల బాలకృష్ణ,రాచకొండ రమేష్ బాబు, గుండమల్ల మల్లేష్, బాలకృష్ణ, సైదులు, వలిగొండ మాధవులు, కట్ట గాలిబ్, రాములు, అశోక్, నర్సింగ్ రావు, గాలయ్య తదితరులు పాల్గొన్నారు.





## ఆటో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్

పెరుగుతున్న ధరలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులు

ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

జూలై 5 బీసీ రణభేరి మహాసభకు 5 వేల మందితో తరలివెళ్లాలని నిర్ణయం

బీసీల హక్కుల సాధనకు భువనగిరి సభను విజయవంతం చేయాలని పిలుపు

అవసరమైతే ఉద్యమాలు చేపడతామని పార్టీ నాయకుల హెచ్చరిక

సంగారెడ్డిలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా సమావేశం నిర్వహణ

ఆటో కార్మికుల సమస్యల పరిష్కారంతో పాటు బీసీ రణభేరి సభ విజయవంతానికి పిలుపు

**సంగారెడ్డి, హైదరాబాద్ మిర్రర్**

**ప్రతినిధి జూన్ 04:**

ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, అలాగే జూలై 5న భువనగిరిలో నిర్వహించే బీసీ రణభేరి మహాసభను విజయవంతం చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర కార్యదర్శి రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి ఐబీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, నిత్యావసర వస్తువుల ధరల భారం కారణంగా ఆటో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అమలుతో ఆటో కార్మికుల ఆదాయం గణనీయంగా తగ్గిందని పేర్కొన్నారు. ఆటో కార్మికులకు ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థిక భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న శాసన మండలిలో ఆటో కార్మికుల సమస్యలను ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. అనంతరం జరిగిన జిల్లా పార్టీ సమావేశంలో జూలై 5న భువనగిరిలో నిర్వహించే బీసీ రణభేరి మహాసభకు సంగారెడ్డి జిల్లా నుంచి 5,000 మంది కార్యకర్తలు, బీసీ యువత, మహిళలు, ప్రజలను భారీ ర్యాలీగా తరలించాలని నిర్ణయించారు. బీసీల రాజకీయ, సామాజిక, ఆర్థిక హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభను చారిత్రాత్మక విజయంగా నిలపాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా అధ్యక్షుడు రవి నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేష్ గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రేమలత, పటాన్‌చెరు టౌన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, సంగారెడ్డి టౌన్ అధ్యక్షురాలు రజిత, టౌన్ అధ్యక్షుడు రవి, పార్టీ నాయకులు, ఆటో కార్మికులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారం కోసం అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని నాయకులు హెచ్చరించారు.





## కురుమ సంఘాన్ని వెనక్కి నెట్టాలని ప్రయత్నిస్తున్నారు

- అందుకే ఆరోపణలు, తప్పుడు ప్రచారాలు
- ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

**గండిపేట్ : హైదరాబాద్ మిర్రర్**

తప్పుడు ప్రచారం చేస్తూ కురుమ సమాజాన్ని వెనక్కి నెట్టాలని కొందరు ప్రయత్నిస్తున్నారని వారి ఆటలు సాగవని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిఆలయ్య అన్నారు. గురువారం కోకాపేట నియో పోలీస్ పరిధిలోని దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనంలో గురువారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మ గౌరవ భవనాన్ని లీజుకు ఇచ్చారని, తాకట్టు పెట్టారని, ట్రస్ట్ ఆస్తుల ద్వారా కొందరు వ్యక్తిగత లబ్ధిపొందుతున్నారనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని అన్నారు. కురుమ సమాజం ఆత్మగౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో ట్రస్ట్ బోర్డు, కుల పెద్దలు చర్చలు జరుపుతున్నారని, కానీ భూములను ఎవరికీ లీజుకు ఇవ్వడం గానీ, రాతపూర్వకంగా అప్పగించడం గానీ జరగలేదన్నారు. కొందరు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేయడం బాధాకరం అని అయిలయ్య ఆవేధన వ్యక్తం చేశారు. రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గే మల్లేశం ఆధ్వర్యంలో కురుమ సంఘ అభివృద్ధికి జరుగుతున్న కార్యక్రమాలను చూసి తాను కూడా తనవంతు సహకారం అందించేందుకు ట్రస్ట్ బాధ్యతల్లో భాగస్వామిగా ఉన్నానని తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు యాదాద్రి భూముల విక్రయం, కోకాపేట ఆత్మగౌరవ భవనం భూముల బదలాయింపు వంటి అంశాల్లో తనను ప్రధాన నిందితుడిగా చిత్రీకరించడం వెనుక రాజకీయ కుట్రలు ఉన్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో ఏకైక కురుమ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న తనపై సొంత కులస్తులే ప్రత్యర్థుల ప్రేరణతో అసత్య ప్రచారం చేయడం బాధ కలిగిస్తోందని పేర్కొన్నారు. కుల సంఘానికి సంబంధించిన అన్ని అంశాలపై పారదర్శకంగా చర్చించేందుకు తానుసిద్ధంగా ఉన్నానని, ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే సమిష్టిగాపరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి క్యామ మల్లేశ్ కురుమ, జంట నగరాల కురుమ సంఘ ప్రతినిధులు, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు నాగేష్, కసిగి శ్రీనివాసరావు, గొరిగే మల్లేశం, నర్సింలు, చేవెళ్ల సంపత్‌కుమార్, గండిపేట మండల కురుమ సంఘం అధ్యక్షుడు భాస్కర్‌తో పాటు వివిధ జిల్లాలు, మండలాల నుంచి వచ్చిన కురుమ సంఘ ప్రతినిధులు, కుల పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.







## విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్లు: ఎమ్మెల్యే జీఎంఆర్

త్వరలో నాలుగు సబ్‌స్టేషన్ల ప్రారంభం

సబ్‌స్టేషన్ల కోసం భూ కేటాయింపులు పూర్తి

ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.5 కోట్ల నిధుల ప్రతిపాదన

ఇనుప విద్యుత్ స్తంభాల తొలగింపునకు ఆదేశాలు

సిమెంట్ స్తంభాల ఏర్పాటుకు ప్రాధాన్యం

విద్యుత్‌ఘాతంతో పశువులు మృతి చెందితే వెంటనే పరిహారం

స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయానికి సూచన

తాగునీటి సరఫరాకు విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

శిథిలావస్థలోని స్తంభాల తొలగింపునకు ఆదేశం

నిధుల కొరత ఉంటే తన దృష్టికి తీసుకురావాలి

సీఎస్ఆర్ నిధుల సమీకరణకు ఎమ్మెల్యే హామీ

వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాపై అధికారులకు అభినందనలు

పటాన్‌చెరులో విద్యుత్ శాఖ సమీక్ష సమావేశం

అభివృద్ధికి అనుగుణంగా విద్యుత్ మౌలిక సదుపాయాల విస్తరణ

మాదారం, ఉస్మాన్నగర్, బొల్లారంలో కొత్త సబ్‌స్టేషన్లకు గ్రీన్ సిగ్నల్

**పటాన్‌చెరు, హైదరాబాద్ మిర్రర్**





**ప్రతినిధి జూన్ 04:**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పటాన్‌చెరు నియోజకవర్గంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా కొత్త సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు, విద్యుత్ సరఫరా, భూ కేటాయింపులు, పూర్తయిన సబ్‌స్టేషన్ల ప్రారంభోత్సవాలపై అధికారులతో చర్చించారు. పటాన్‌చెరు ఎంపీడీవఓ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ఇండోర్ సబ్‌స్టేషన్‌తో పాటు సింఫనీ కాలనీ, పోచారం, లక్డారం సబ్‌స్టేషన్ల పనులు తుది దశకు చేరుకున్నాయని, వీటిని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాదారం, రామేశ్వరంబండ, ఉస్మాన్నగర్, బొల్లారం ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు భూ కేటాయింపులు పూర్తయ్యాయని చెప్పారు. ఒక్కో సబ్‌స్టేషన్‌కు రూ.5 కోట్ల చొప్పున నిధులు మంజూరు చేయాల్సి ఉందని, దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఇనుప విద్యుత్ స్తంభాలు ఉండకుండా వాటి స్థానంలో సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్‌ఘాతంతో పశువులు మృతి చెందిన సందర్భాల్లో రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా నష్టపరిహారం చెల్లించాలని సూచించారు. కొత్త సబ్‌స్టేషన్ల ప్రతిపాదనలు అందితే రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసి స్థలాలు కేటాయిస్తామని తెలిపారు. వేసవికాలంలో ప్రజలకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించిన అధికారులను అభినందించారు. మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి సరఫరాకు విద్యుత్ కోతలు లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిధుల సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే పరిశ్రమల యాజమాన్యాలతో చర్చించి సీఎస్ఆర్ నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ డీఈ భాస్కరరావు, ఏడీఈలు సంజయ్, దుర్గాప్రసాద్, నాగరాజు, జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్‌రెడ్డి, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్లో ఘనంగా ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక వార్డు సభలు





**చౌటుప్పల్, జూన్ 4, హైదరాబాద్ మిర్రర్:**

- కలిసికట్టుగా పనిచేస్తే వార్డుల అభివృద్ధి సాధ్యం
- మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి లోని 1,2,3,12,13 వార్డులలో గురువారం ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం ప్రణాళికలో భాగంగా వార్డు సభలను ఆయా వార్డుల కౌన్సిలర్ల అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పాల్గొని మాట్లాడుతూ... అన్ని వార్డులలో కలిసికట్టుగా పనిచేస్తే వార్డుల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ, వ్యవసాయం,పరిశుభ్రత- పర్యావరణం, ప్రజా భాగస్వామ్యం వంటి అంశాలపై చర్చించారు. ఆయా వార్డుల లోని సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కార దిశగా తక్షణ చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో అన్ని వార్డుల అభివృద్దే తమ లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రతి వార్డులో ఉన్న ప్రజా సమస్యలను వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల సహకారంతో శక్తివంచన లేకుండా పరిష్కరిస్తామని ప్రజలకు భరోసా ఇచ్చారు. వర్షాకాలంలో ప్రభలే సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల వైద్యాధికారి సిహెచ్ కాటమరాజు ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాలు, ఫ్రెండ్లీ పోలీసింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ వంటి అంశాలపై సీఐ మన్మథకుమార్ వార్డు ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ప్రభుత్వ పెన్షన్లు,ఇందిరా మహిళ పథకాలు, తడి చెత్త- పొడి చెత్త వేరు చేయడం కొన్ని అంశాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. కోఆప్షన్ సభ్యులు షేక్ నబీబి జానీ బాబా చైర్ పర్సన్ సహకారంతో సమస్యల పరిష్కార మార్గాలను తెలియపరిచారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఒకే వేదిక పైకి వచ్చి నేరుగా తమ సమస్యలను ఆలకించి, పరిష్కారాలు చూపడం పట్ల ఆయా వార్డుల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాహసిల్దార్ వీరాబాయి,మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర నాయక్ , సిఐ జి మన్మధ కుమార్, కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, పోలేపల్లి లక్ష్మీ ముత్తయ్య,పల్లె లావణ్య సురేందర్ రెడ్డి, బత్తుల వాణి విప్లవ కుమార్, పాక చిరంజీవి, మున్సిపల్ సిబ్బంది, వార్డు సభల నోడల్ అధికారులు,వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గడ్డం ప్రసాద్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అంకం శ్రీనివాస్ నేత

**గండిపేట్ : హైదరాబాద్ మిర్రర్**

తెలంగాణ శాసన సభపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సెల్ జనరల్ సెక్రటరీ, బండ్లగూడ జాగీర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అంకం శ్రీనివాస్ నేత ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.



# ప్రజాధనం దుర్వినియోగం కావడానికి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యుడు

## రాజేంద్రనగర్ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ధ్వజం

- రెండు దశాబ్దాలు దాటినా పూర్తికాని కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్!
- రూ. 30 కోట్లు ఖర్చు చేసినా ప్రజలకు దక్కని ఫలితం.
- నర్సబాయికుంట సుందరీకరణ నిధులు పందికొక్కులు మేసేశాయి.
- పనుల పేరుతో అనుచరులకు బిల్లులు దోచిపెడుతున్నారంటూ తీవ్ర విమర్శలు.

**గండిపేట్ : హైదరాబాద్ మిర్రర్**





రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల పేరుతో ప్రజాధనం భారీగా దుర్వినియోగం అవు తోందని, దీనికి స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ బాధ్యత వహించాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. నియోజక వర్గంలో పనులు జరగకపోయినా, ఎమ్మెల్యే తన అనుచరులైన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయించుకుంటూ లబ్ధి చేకూరుస్తున్నారని ఆరోపించారు. రూ. 30 కోట్లు దాటినా పూర్తికాని స్పోర్ట్స్ కాంప్లెక్స్ రెండు దశాబ్దాల క్రితం (18-03-2007 నాడు) అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి రూ. 5 కోట్ల అంచనా వ్యయంతో కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులకు శ్రీకారం చుట్టారని కార్తీక్ రెడ్డి గుర్తుచేశారు. ఆ నిధులు సరిపోకపోవడంతో మరో ఐదు కోట్లు.. ఇలా నాలుగు సార్లు అంచనాలు పెంచుకుంటూ దాదాపు రూ. 20 నుంచి 30 కోట్ల వరకు ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. అయినా నేటికీ ఈ కాంప్లెక్స్ స్థానిక యువతకు అందుబాటులోకి రాలేదని మండిపడ్డారు. వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఒకటే అన్నట్లుగా ఎమ్మెల్యే వ్యవహారం ఉందని, పనులు పూర్తి కాకుండానే కేవలం ఎన్నికల లబ్ధి కోసమే ఆగమేఘాలపై దీనిని ప్రారంభించారని, ఈ మోసాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. పదేళ్ల క్రితం (06-05-2016 నాడు) రూ. 1 కోటి 15 లక్షల 35 వేల అంచనాలతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్వయంగా నర్సబాయికుంట సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారని కార్తీక్ రెడ్డి తెలిపారు. కొన్ని రోజులు జేసీబీతో భూమిని చదును చేసి, నిధులు సరిపోవడం లేదనే నెపంతో మళ్లీ మరో కోటి రూపాయలు మంజూరు చేయించారన్నారు. తీరా చూస్తే ఒక తూము వద్ద రెండు కాంక్రీట్ దిమ్మలు కట్టి, చెరువు కట్టకు రాళ్లు పేల్చి చేతులు దులుపుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సబాయికుంట సుందరీకరణ కోసం వచ్చిన సుమారు రెండు కోట్ల రూపాయల ప్రజాధనాన్ని పందికొక్కులు మేసినట్లుగా నాయకులు, కాంట్రాక్టర్లు తిన్నారే తప్ప అక్కడ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లుగా ఉందని చుట్టుపక్కల కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. నర్సబాయికుంట సుందరీకరణ మరియు పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన నిధులు పక్కదారి పట్టకుండా, పనులు సక్రమంగా జరిగేలా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృష్టి పెట్టాలని స్థానిక బస్తీల ప్రజలు కోరుకుంటున్నారు. ఇప్పటికైనా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టి, నాణ్యమైన పనులు పూర్తి చేయకపోతే ప్రజల పక్షాన పెద్ద ఎత్తున పోరాడుతామని కార్తీక్ రెడ్డి హెచ్చరించారు.

# నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు

## ప్రభుత్వం నిర్లక్ష్యమే కారణం: తలసాని

**హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

అగ్నిప్రమాదాలను నివారించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం అమీర్ పేటలోని మైత్రివనం వద్ద అగ్నిప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సందర్శించారు. ప్రమాదం వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు, కమర్షియల్ కాంప్లెక్స్ ల నిర్వాహకులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా అగ్నిమాపక శాఖకు అవసరమైన ఆధునిక పరికరాలు అందుబాటులో కి తేవాలని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే సకాలంలో స్పందించిన అధికారులను ఆయన అభినందించారు. ప్రమాదంలో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి, నాయకులు అశోక్ యాదవ్, నామన సంతోష్, ప్రవీణ్ రెడ్డి, సుమిత్ సింగ్, కట్టా బలరాం, సాయి, ప్రదీప్ గౌడ్, తదితరులు ఉన్నారు.

# తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షం

## - కరీంనగర్,జనగామ, ములుగు జిల్లాలో మోస్తరు వానలు

**హైదరాబాద్,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పుర్‌తో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంతో పాటు హుజూరాబాద్‌లో ఓ మోస్తరు వర్షం కురిసింది. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లో గాలి దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు వర్షం పడింది. ములుగు జిల్లా మల్లంపల్లి, వెంకటాపూర్, ములుగు మండలంలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. కరీంనగర్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. కాలనీలకు కాలనీలు నీట మునిగిన పరిస్థితి ఉంది. సుభాష్ నగర్, ఆదర్శనగర్ కాలనీలు జలమయం కావడంతో ఇళ్లలోకి వరద నీరు చేరింది. స్థానిక కార్పొరేటర్ వైద్యుల అంజన్ కుమార్ సహాయక చర్యలు చేపట్టారు. ప్రొ÷-లకెయినర్ల సహాయంతో డ్రైనేజీలు క్లీన్ చేయించి వరద నీరు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ నగరంలో కురిసిన భారీ వర్షానికి కట్టరాంపూర్ నాగన్న చౌరస్తా దగ్గర ఓ ఇంటి ప్రహరీ కూలింది. గోడతో పాటు పక్కనే ఉన్న భారీ వృక్షం కూడా నేలకొరిగింది. అటుగా నిలిపి ఉన్న కారుపై శిథిలాలు పడటంతో కారు స్వల్పంగా దెబ్బతిన్నది. ఈ ఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. భారీ ప్రమాదం తప్పడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వర్షాలు పడుతున్న క్రమంలో.. పాత గోడలు, భారీ వృక్షాల దగ్గర జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు. భారీ వర్షానికి పక్కనే ఉన్న డ్రైనేజీ పొంగి కరీంనగర్ రిజిస్ట్రేషన్ కార్యాలయ ప్రాంగణం అంతా జలమయమైంది. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్?లో పిడుగు పడింది. మొబైల్?తో వర్షాన్ని రికార్డ్ చేస్తుండగా స్థానికుడు పిడుగుపాటుతో ఉలిక్కిపడ్డాడు.


# రైతులు ఇబ్బందులను పట్టించుకోని సిఎం పర్యటనలతో ఒరిగేదేమీ లేదు: నిరంజన్ రెడ్డి

**వనపర్తి,జూన్4 హైదరాబాద్ మిర్రర్ ప్రతినిధి**

రాష్ట్ర రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడ్డ సమయంలో కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్టుల సందర్శన పేరుతో హడావుడి చేస్తున్నారని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. సీఎం గురువారం పాలమూరు పర్యటన సందర్భంగా పలు ప్రశ్నలు సంధించారు. విపత్తుల సమయంలో రాకుండా , రైతుల సమస్యలను పరిగణనలోకి తీసుకోకుండా చేస్తున్న ఈ పర్యటనలు ఎవరికి ఉపయోగమని నిలదీశారు. సీఎం పర్యటనే వేళ తెలంగాణ వాదులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సబబు కాదని, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ వడ్లు కల్లాల్లోనే ఉన్నాయని,రైతు భరోసా అడుగుతారనే హెలికాప్టర్‌లో పర్యటిస్తున్నారని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మీద ప్రజలు ఆశలు కోల్పోయారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని, భవిష్యత్తులో వారికి పరాభవం తప్పదని హెచ్చరించారు.

# ప్రశాంత్ నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే విషెస్

ఇండియన్ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ పుట్టినరోజు సందర్భంగా అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ సోషల్ మీడియా వేదికగా ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రశాంత్ నీల్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని, అలాగే వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోయే డ్రాగన్ సినిమాను గుర్తుచేస్తూ.. ఎన్టీఆర్ పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ట్వీట్‌లో ఎన్టీఆర్ స్పందిస్తూ.. 'పుట్టినరోజు శుభాకాంక్షలు డైరెక్టర్ గారూ.. మీరు చెప్పే కథలంత గొప్పగా ఈ ఏడాది మీకు సాగాలని కోరుకుంటున్నాను. మన కాంబినేషన్‌లో రాబోయే ప్రాజెక్ట్ కోసం, మన భవిష్యత్తు ప్రయాణం కోసం నేను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను ప్రశాంత్ అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చారు. ఈ పోస్ట్‌లో ప్రశాంత్ నీల్‌ను ఉద్దేశించి ఎన్టీఆర్ కన్నడ పదం 'అవరే' (గారూ) అని




సంబోధించడం ఇరు భాషల అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. 'కేజీఎఫ్', 'సలార్' వంటి ఇండస్ట్రీ హిట్ చిత్రాలతో సంచలనం సృష్టించిన ప్రశాంత్ నీల్, ఎన్టీఆర్ కాంబినేషన్‌లో రాబోయే భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ డ్రాగన్ పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.


# దురంధర్ సరికొత్త రికార్డులు
## మూవీ విజయంపై అంబానీ హర్షం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ హీరోగా జియో స్టూడియోస్ నిర్మించిన 'ధురంధర్' ఫ్రాంచైజీ బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిత్రం సాధించిన అసాధారణ విజయంపై రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ హర్షం వ్యక్తంచేశారు. జియో స్టూడియోస్ సాధించిన విజయాలను అభినందిస్తూ లేఖ రాశారు. 2024లో 'స్త్రీ 2', 2025లో 'ధురంధర్', 2026లో 'ధురంధర్: ది రివెంజ్' చిత్రాలతో జియో స్టూడియోస్ వరుసగా మూడేళ్లపాటు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలను అందించి ఒక అరుదైన మైలురాయిని అందుకుంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో జియో స్టూడియోస్ విడుదల చేసిన స్పై యాక్షన్ థ్రిల్లర్స్ 'ధురంధర్', 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ కలెక్షన్లలోనే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ఆదరణలో సరికొత్త బెంచ్‌మార్క్‌లను క్రియేట్ చేశాయి' అని లేఖలో పేర్కొన్నారు. ఈ సిరీస్‌లో వచ్చిన మొదటి భాగం, భారతీయ సినిమా చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచి సరికొత్త రికార్డు సృష్టించిందని ముకేశ్ అంబానీ తెలిపారు. థియేటర్లలో 15 వారాల పాటు హౌస్‌ఫుల్ బోర్డులు కనిపించాయన్నారు. ఆ తర్వాత భారీ అంచనాల మధ్య విడుదలైన రెండో భాగం.. మొదటి సినిమా నెలకొల్పిన రికార్డులన్నింటినీ బద్దలు కొట్టిందని తెలిపారు. ఇది తిరుగులేని విజయమని వ్యాఖ్యానించారు. ఈ సినిమాలు రూ.3000 కోట్లకు పైగా వసూళ్లు సాధించి.. మొత్తం దేశ థియేట్రికల్ ఆదాయంలో 40శాతం వాటాను దక్కించుకున్నాయని ప్రశంసించారు.



# త్వరలోనే ఇరుముడి థీమ్ సాంగ్ విడుదల

మాస్ మహారాజా రవితేజ, డైరెక్టర్ శివ నిర్వాణ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మోస్ట్ అవేటెడ్ ప్రాజెక్ట్ 'ఇరుముడి' నుంచి అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఒక సాలిడ్ అప్‌డేట్ వచ్చేసింది. ఇప్పటికే ఈ మూవీ నుంచి గ్లింప్స్‌ను విడుదల చేయగా.. ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటుంది. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఒక ప్రత్యేకమైన సాంగ్ అప్‌డేట్‌ను మేకర్స్ సోషల్ మీడియా వేదికగా అధికారికంగా పంచుకున్నారు. గత కొన్ని రోజులుగా అభిమానుల నుంచి వస్తున్న భారీ రిక్వెస్ట్‌లను పరిగణనలోకి తీసుకుని, ఈ సినిమాకు సంబంధించిన పవర్‌ఫుల్ 'ఇరుముడి' థీమ్ సాంగ్‌ను త్వరలోనే విడుదల చేయబోతున్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ పాట 'విల్లాది వీరుడు వీర మణికంఠుడు' అనే పవర్‌ఫుల్ అయ్యప్ప స్వామి భక్తి గీతంగా ఉండబోతోందని తెలుస్తుంది. ఇటీవల విడుదలైన ఈ సినిమా గ్లింప్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోగా, ఇందులో రవితేజ ఒక ఎమోషనల్ తండ్రి పాత్రలో సరికొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. కూతురి కోసం ఒక తండ్రి పడే తపన, మద్యపానానికి దూరమై అయ్యప్ప దీక్ష స్వీకరించి ఆధ్యాత్మిక మార్గంలో సాగే ఒక ఎమోషనల్ అండ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా కథాంశం ఉండబోతోంది. ఈ చిత్రంలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ నటిస్తుండగా, బేబీ నక్షత్ర రవితేజ కూతురిగా కీలక పాత్ర పోషిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ జి.వి. ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ భారీ చిత్రం ఆగస్టులో థియేటర్లలోకి రానుంది.





# పెద్ది థియేటర్‌లో ఉపాసన హంగామా

తన ఆటలతో అభిమానులకు ఫుల్ ట్రీట్ ఇచ్చాడు రామ్ చరణ్. ఆయన హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' థియేటర్‌లలో సందడి చేస్తోంది. ఈ చిత్రం ప్రీమియర్స్‌లో రామ్ చరణ్ భార్య ఉపాసన ఎంజాయ్ చేశారు. హైదరాబాద్ బాలానగర్‌లో స్పెషల్ స్క్రీనింగ్‌కు వచ్చిన ఉపాసన , అభిమానుల మధ్య సినిమా చూసి వారిలో ఉత్సాహం నింపారు. రామ్ చరణ్ ఎంట్రీ సమయంలో పేపర్‌లు ఎగరేసి జోష్ పెంచారు. ఫ్యాన్స్‌తో పాటు ఆమె కూడా ఉత్సాహంగా అరుస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఇక పెద్ది హిట్ టాక్ రావడంతో థియేటర్‌ల వద్ద పండగ వాతావారణం నెలకొంది. రామ్ చరణ్ నటనను ప్రశంసిస్తూ సెలబ్రిటీలు పోస్ట్‌లు పెడుతున్నారు. కష్టానికి తగిన ప్రతిఫలం దక్కిందంటూ అభినందిస్తున్నారు.



# నా మనసంతా పెద్ది చుట్టే తిరుగుతోంది
### పొలాచ్చి లో ఉండిపోవడంతో రాలేక పోయా
### పెద్ది విజయంపై చిరంజీవి అభినందనలు

తాను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా తన మనసంతా 'పెద్ది' దగ్గరే ఉందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. రామ్ చరణ్ హీరోగా తెరకెక్కిన 'పెద్ది' నేడు ప్రేక్షకుల ముందుకువచ్చి విజయాన్ని సొంతం చేసుకుంది. దీంతో ఒక తండ్రిగా, నటుడిగా తనకెంతో గర్వంగా ఉందంటూ చిరంజీవి పోస్ట్ పెట్టారు. ఈసందర్భంగా చిత్రబృందాన్ని అభినందించారు. నేను షూటింగ్ నిమిత్తం పొల్లాచిలో ఉన్నా కూడా నా మనసంతా 'పెద్ది' దగ్గరే ఉంది. గత రెండేళ్లుగా ఈ సినిమా కోసం చరణ్ పడిన కష్టం, పెట్టిన శ్రద్ధాసక్తులు అన్నీ దగ్గర నుంచి చూశాను. ఈ రోజు ప్రేక్షకుల ప్రేమ, ప్రశంసలు చూస్తుంటే ఒక తండ్రిగా మాత్రమే కాదు, ఒక నటుడిగా కూడా ఎంతో గర్వంగా అనిపిస్తోంది.





# శ్రీవారిని దర్శించుకున్న జాన్వీకపూర్

తిరుమల శ్రీవారిని సినీ నటి జాన్వీ కపూర్ దర్శించుకున్నారు. బుధవారం అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు చేరుకున్న జాన్వీ.. గురువారం ఉదయం నటి మహేశ్వరితో కలిసి స్వామివారి సేవలో పాల్గొన్నారు. అంతకుముందు తితిదే అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వారికి ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. జాన్వీ కపూర్, రామ్‌చరణ్ జంటగా నటించిన 'పెద్ది' ఇవాళ విడుదలైన విషయం తెలిసిందే.

# సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా
### 'బుక్ మై షో'లో గంటకు 40వేల టికెట్స్ బుక్

ప్రస్తుతం సోషల్ మీడియాలో 'పెద్ది' మేనియా కనిపిస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా వాటిని అందుకొని హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకువచ్చిన విషయం తెలిసిందే. రిలీజ్‌కు ముందు నుంచే టికెట్ బుకింగ్స్‌లో జోరు చూపిన చిత్రం విడుదల అనంతరం కూడా అదే కొనసాగిస్తోంది. ప్రముఖ టికెట్ బుకింగ్ యాప్ 'బుక్ మై షో'లో 'పెద్ది'కు గంటకు 40వేల టికెట్స్ బుక్ అవుతున్నాయి. 2023లో బుక్‌మై షో ప్రవేశపెట్టిన 'అవర్లీ ట్రెండింగ్' ఫీచర్ తర్వాత.. ఈ 40 వేల మార్క్‌ను దాటిన చిత్రాల జాబితాలో ఇప్పటివరకు మూడు సినిమాలు మాత్రమే ఉన్నాయి. కల్కి 2898 ఏడీ, సలార్, పుష్ప తర్వాత స్థానంలో 'పెద్ది' నిలిచింది. మొదటిరోజే ఈ మార్క్‌ను చేరుకొని రికార్డు సృష్టించింది.

# వైభవ్ సూర్యవంశీకి టీమిండియా పిలుపు?



ఐపీఎల్ వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకురావాలనే వాదన చాలా బలంగా వినిపిస్తోంది. లెజెండ్రీ క్రికెటర్ల దగ్గర నుంచి సామాన్య అభిమాని వరకూ వైభవ్ టీమిండియాలోకి రావాలనే కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బీసీసీఐ కూడా అటువైపు అడుగులు వేస్తోంది. సూర్యవంశీకి జాతీయ జట్టులో చోటు కల్పించాలని అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ కూడా తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అదేవిధంగా సూర్యకుమార్ యాదవ్ స్థానంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పటిదార్‌ను ఆడించాలని చూస్తోంది. టీమిండియా టీ20 వరల్డ్‌కప్ అందించిన కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ శకం ఇక దాదాపు ముగిసినట్టే. ఇప్పటికే సూర్యకుమార్ యాదవ్‌ను టీమిండియా టీ20 కెప్టెన్‌గా తొలగిస్తున్నారనే వార్తలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. ఆ ప్లేస్‌లో సర్పంచ్ సాబ్ శ్రేయాస్ అయ్యర్‌ను నూతన కెప్టెన్‌గా నియమిస్తున్నారని కూడా తెలుస్తోంది. ఐసీసీ టీ20 వరల్డ్ కప్ 2024, 2026లో వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన భారత్.. ఇప్పుడు మూడోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని ఉంది. దాంతో టీ20 వరల్డ్‌కప్ 2028 టార్గెట్‌గా బీసీసీఐ అడుగులు వేస్తోంది. ఆ క్రమంలోనే సూర్యకుమార్ యాదవ్‌ను తప్పించనున్న బీసీసీఐ.. యువ ఆటగాళ్లు, అనుభవం ఉన్న ప్లేయర్లతో జట్టును సిద్ధం చేయాలని ఫిక్స్ అయినట్టుంది. ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీతో పాటు రెండుసార్లు ఆర్సీబీని ఛాంపియన్‌గా నిలిపిన రజత్ పటిదార్‌ను టీ20 జట్టులోకి తీసుకురావాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. కేవలం 15 ఏళ్ల వయస్సులోనే జాతీయ జట్టులో చోటు కల్పించడం సరైనదేనా? అనే చర్చ జరుగుతున్నప్పటికీ.. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలెక్షన్ కమిటీ మాత్రం సూర్యవంశీకి టీమిండియా క్యాప్ అందించాలని చాలా సీరియస్‌గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను పూర్తిగా తొలగిస్తే అతని స్థానంలో నెంబర్ 4లో రజత్ పటిదార్‌ను ఆడిస్తే బాగుంటుందేమో అని బీసీసీఐ పరిశీలిస్తోంది. పటిదార్ కెప్టెన్సీలో ఆర్సీబీ వరుసగా రెండు ఐపీఎల్ టైటిల్స్ గెలవడమే కాకుండా.. కెప్టెన్ ధోనీ, రోహిత్ శర్మ సరసన కూడా నిలిచాడు. దాంతో పాటు ఐపీఎల్ 2026లో కెప్టెన్‌గా సక్సెస్ కావడమే కాకుండా 192.69 స్ట్రయిక్ రేట్‌తో 501 పరుగులు కూడా చేసి సత్తా చాటాడు. టీమిండియాలోకి వైభవ్‌ను వీలైనంత త్వరగా తెచ్చేందుకు బీసీసీఐ చాలా ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే సూర్యవంశీని ఈ నెలలో శ్రీలంకలో జరగనున్న ఇండియా - ఏ, అఫ్ఘనిస్థాన్ - ఏ, శ్రీలంక - ఏ మధ్య జరగనున్న ట్రై సిరీస్‌కు కూడా స్క్వాడ్‌లో సెలెక్ట్ చేశారు. ఈ సిరీస్‌లో వైభవ్ తన సత్తా చాటితే రానున్న కాలంలో టీమిండియాలో అడుగుపెట్టడం ఖాయమనే చెప్పొచ్చు.

# రోహిత్, కోహ్లీ వన్డే సిరీస్ ఆడతారా? ఫిట్‌నెస్‌పై కొనసాగుతున్న సస్పెన్స్



అఫ్ఘానిస్థాన్‌తో జూన్ 13 నుంచి ప్రారంభం కానున్న 3 వన్డేల సిరీస్‌లో భారత స్టార్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడతారా లేదా అనే దానిపై సస్పెన్స్ కొనసాగుతోంది. గాయాల కారణంగా వీరిద్దరూ దూరమవుతున్నారంటూ సోషల్ మీడియాలో వస్తున్న వార్తలపై భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే స్పందించారు. ఫిట్‌నెస్ ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయని, వైద్య బృందం నివేదిక ఆధారంగా త్వరలోనే అధికారిక నిర్ణయం ప్రకటిస్తామని ఆయన స్పష్టం చేశారు. టీమిండియా స్టార్ బ్యాటర్లు విరాట్ కోహ్లీ , రోహిత్ శర్మ .. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు గుడ్‌బై చెప్పి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్న విషయం తెలిసిందే. వచ్చే ఏడాది జరిగే ప్రపంచకప్‌లో ఆడటమే లక్ష్యంగా వీరిద్దరూ అడుగులు వేస్తున్నారు. ఇక స్వదేశంలో జూన్ 13 నుంచి అఫ్ఘానిస్థాన్‌తో భారత్ వన్డే సిరీస్‌లో ఆడనుంది. మొత్తంగా మూడు వన్డే మ్యాచ్‌లు ఈ సిరీస్‌లో జరుగుతాయి. ఇందుకోసం ఎంపిక చేసిన జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ రోహిత్, కోహ్లీలు ఈ సిరీస్‌లో ఆడేది అనుమానంగా మారింది.ధర్మశాల వేదికగా తొలి వన్డే జరగనుంది. శుభమన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు ఈ సిరీస్‌లో తలపడనుంది. అయితే గాయాల కారణంగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ.. వన్డే సిరీస్‌కు దూరమవుతారనే ప్రచారం జరుగుతోంది. దీనిపై రకరకాల వార్తలు వస్తున్నాయి. రోహిత్ దూరమయ్యాడని.. కోహ్లీ ఆడతాడా లేడా అనేది తేలాల్సి ఉందని సోషల్ మీడియాలో నెటిజన్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో భారత అసిస్టెంట్ కోచ్ టెన్ డస్కటే ఈ విషయంపై అప్‌డేట్ ఇచ్చాడు. "బయట ఎలాంటి చర్చ జరిగినా అనవసరం. అధికారికంగా మేం త్వరలోనే సమాచారం ఇస్తాం. విరాట్ కోహ్లీ లేదా రోహిత్ శర్మ వంటి పెద్ద ఆటగాళ్లు సిరీస్‌లో ఆడకపోవడం బిగ్ న్యూస్ అవుతుందని తెలుసు. ఫిట్‌నెస్‌కు సంబంధించి ప్రోటోకాల్స్ అందరికీ ఒకేలా ఉంటాయి. సిరీస్ ప్రారంభానికి ఇంకొంత సమయం ఉంది. ఆలోగా మేం నిర్ణయం తీసుకుంటాం. ఫిట్‌గా ఉంటే తుది జట్టులో ఉంటారు. లేకపోతే అందుకు తగినట్టుగా మార్పులు చేసుకుంటాం. వైద్య బృందం నిర్ణయం తర్వాత.. ఆయా ఆటగాళ్ల పరిస్థితిపై అధికారికంగా స్పందిస్తాం" అని టెన్ డస్కటే చెప్పాడు.

### వన్డే సిరీస్ కోసం భారత జట్టు..

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అర్ష్‌దీప్ సింగ్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, నితీశ్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్‌దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, ప్రిన్స్ యాదవ్, గూర్నూర్ బ్రార్, హర్ష్ దూబె.

# హర్మన్‌ప్రీత్ ఖాతాలో మరో వరల్డ్ రికార్డు

క్రికెట్ అంటేనే ఇండియా పేరు మార్మోగిపోతోంది. అది ఏ ఫార్మెట్ కాని.. రికార్డులు తిరగరాస్తున్నారు. భారత మెన్ క్రికెట్ జట్టుతో సమానంగా విమెన్ క్రికెట్ జట్టు కూడా పటిష్టంగానే ఉంది. ఇక భారత మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన క్రీడాకారిణిగా హర్మన్‌ప్రీత్ కౌర్ సరికొత్త చరిత్ర లిఖించారు. ఇప్పటి వరకు న్యూజిలాండ్ క్రీడాకారిణి సుజీ బేట్స్ (367 మ్యాచ్‌లు) ఆడి టాప్ ప్లేసులో ఉండగా.. ఇంగ్లండ్‌లోని టాంటన్‌లో మంగళవారం జరిగిన మూడో టీ20 మ్యాచ్ తర్వాత హర్మన్‌ప్రీత్ కౌర్ కెరీర్‌లో 368వ అంతర్జాతీయ మ్యాచ్ పూర్తి చేసుకుంది. దీంతో న్యూజిలాండ్ ప్లేయర్ పేరుతో ఉన్న రికార్డును అధిగమించారు. ఈ జాబితాలో సుజీ బేట్స్ రెండో స్థానంలో ఉండగా ఆస్ట్రేలియాకు చెందిన ఎల్లీస్ పెర్రీ (357 మ్యాచ్‌లు) మూడో స్థానంలో కొనసాగుతున్నారు. 2009లో అంతర్జాతీయ అరంగేట్రం చేసిన 37 ఏళ్ల హర్మన్‌ప్రీత్ పంజాబ్‌కు చెందిన ఆల్‌రౌండర్. ప్రస్తుతం విమెన్ టీమిండియా జట్టు సారథిగా ఉంది. ఇప్పటివరకు 7 టెస్టులు, 164 వన్డేలు, 197 టీ20 మ్యాచ్‌లు ఆడారు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌ను భారత్ 1-2 తేడాతో కోల్పోయినప్పటికీ నిర్ణయాత్మకమైన ఆఖరి మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ హాఫ్ సెంచరీతో రాణించడం విశేషం. 2025లో భారత జట్టుకు తొలిసారిగా మహిళల ప్రపంచకప్ అందించిన కెప్టెన్‌గా హర్మన్‌ప్రీత్ అరుదైన ఖ్యాతిని సొంతం చేసుకుంది. అంతే కాదు విమెన్స్ ప్రీమియర్ లీగ్‌లో ముంబై ఇండియన్స్‌కు పలు టైటిళ్లు సాధించిపెట్టిన భారత మహిళల క్రికెట్ సారథిగా ఆమెకు మంచి గుర్తింపు ఉంది. ఇక ఆట పరంగా చూసుకుంటే కూడా కౌర్ బ్యాటింగ్, బౌలింగ్ తో పాటు కెప్టెన్సీని కూడా సమర్థవంతంగా పోషిస్తూ ఆల్‌రౌండర్ ప్రతిభను చాటుకుంటోంది. హర్మన్‌ప్రీత్ కౌర్ అరుదైన ఘనత సాధించడంపై సహచర క్రీడాకారులు, జట్టు ప్రధాన కోచ్ అభినందనలు తెలిపారు. మహిళల క్రికెట్‌లో అంతర్జాతీయ మ్యాచ్‌ల సంఖ్య పెరుగుతున్న ఈ రోజుల్లో ఆమె స్థిరత్వం, అంకితభావానికి ఈ రికార్డు నిదర్శనమని క్రీడా వర్గాలు ప్రశంసిస్తున్నాయి.





# వైభవ్‌కు ఎక్కడ బంతి వేయాలో కూడా అర్థం కాలేదు

## సన్‌రైజర్స్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఐపీఎల్ 2026 నుంచి బయటకు రావడానికి ఏకైక కారణం వైభవ్ సూర్యవంశీ. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులతో ఊచకోత కోశాడు. అయితే, ఆ రోజు బౌలర్లకు వైభవ్‌కు ఎక్కడ బంతి వేయాలో కూడా అర్థం కాలేదని.. అలాంటి ఆటను తానెప్పుడూ చూడలేదంటూ సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్ ఓ పోడ్‌కాస్ట్‌లో చెప్పాడు. ఐపీఎల్ 2026లో వైభవ్ సూర్యవంశీ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. ముఖ్యంగా ఎలిమినేటర్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కి కాళ రాత్రి మిగిల్చాడు. ఆ రాత్రి సూర్యవంశీ బాదే బాదుడుకు బంతి ఎక్కడ వేయాలో కూడా బౌలర్లకు అర్థం కాలేదని సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ప్లేయర్ మళ్లీ గుర్తు తెచ్చుకున్నాడు. 15 ఏళ్ల ఈ బుడ్డోడు క్రికెట్ చరిత్రలో గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లు ఆడాడు. ముల్లాన్‌పూర్ వేదికగా జరిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ - రాజస్థాన్ రాయల్స్ ఎలిమినేటర్ మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేశాడు. ఐపీఎల్ ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు బ్రేక్ చేస్తారని అందరూ ఊహించారు. వైభవ్ విధ్వంసానికి సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇంటిదారి పట్టాల్సి వచ్చింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగి క్వాలిఫయర్ 2లో కూడా వైభవ్ 96 పరుగులతో రాణించడం విశేషం. అయితే, సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 12 సిక్సర్లు బాదిన వైభవ్ బౌలర్లకు చుక్కలు చూయించాడని సన్‌రైజర్స్ ప్లేయర్ లియామ్ లివింగ్‌స్టోన్ అన్నాడు. తన కెరీర్‌లో ఏడు ఐపీఎల్ సీజన్‌లు ఆడానని.. ఎంతో మంది మంచి ప్లేయర్లను చూశానని.. కానీ ఇలాంటి ప్లేయర్‌ను మాత్రం చూడలేదంటూ ఓ పోడ్‌కాస్ట్‌లో షాకింగ్‌గా చెప్పాడు. "నా కెరీర్‌లో ఇలాంటోడిని చూడలేదు. ఏడు సీజన్‌లుగా నేను ఐపీఎల్‌లోనే ఉన్నాను. నేను ఎంతో మంది మంచి ప్లేయర్లతో ఆడాను, కానీ ఇలాంటి ఆటగాడిని మాత్రం చూడలేదు. అతడు బంతిని కొట్టే విధానమే వేరు, చాలా క్లీన్‌గా షాట్లు ఆడతాడు. నిజం చెప్పాలంటే అతడు బంతిని రాంగ్‌గా ఆడటం చాలా అరుదనే చెప్పొచ్చు. టోర్నమెంట్ మొత్తం చూసినా మిస్ హిట్ చేసిన సందర్భాలు దాదాపు లేవు. మొదటి సారి మేము బౌన్సర్‌తో అతడిని ఔట్ చేశాం. తొలి బంతికే అతడు బంతిని నేరుగా గాల్లోకి లేపాడు. కానీ, టోర్నమెంట్ ప్రారంభం నుంచి చివరి వరకు అతని ఆటలో వచ్చిన మార్పు చాలా అద్భుతం. మేము బౌన్సర్ వేస్తే థర్డ్ మ్యాన్ మీదుగా బౌండరీ కొట్టేవాడు. ఈ వైపు బంతి వేస్తే అటు కొట్టేవాడు. ఫుల్ లెంగ్త్ వేస్తే మరో వైపు పంపేవాడు. లో ఫుల్‌టాస్ వేస్తే కూడా గ్యాప్‌ల్లోకి పంపించేవాడు. అప్పుడు మాకు ఎక్కడ బౌలింగ్ చేయాలి అనేది ఒక్క నిమిషం అర్థం కాలేదు" అంటూ లియామ్ లివింగ్‌స్టోన్ స్టిక్ టు క్రికెట్ పోడ్‌కాస్ట్‌లో అన్నాడు. వైభవ్ సూర్యవంశీ 776 పరుగులతో ఐపీఎల్ 2026 సీజన్‌లో అత్యధిక పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకున్నాడు.



# వైభవ్ పై మనసుపారేసుకున్న రిద్ధిమా పాఠక్

సమరంలో విరోచితమైన ఆట తీరు ప్రదర్శించి వరల్డ్ వైడ్‌గా ఫేమస్ అయిన 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ తన నిర్భయమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. వైభవ్ సాధించిన విజయాలు దేశీయంగా, అంతర్జాతీయంగా అన్నిచోట్లా ప్రశంసలు అందుకుంటున్నాయి. ఇటీవల, 2026 ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో ఆరెంజ్ క్యాప్ గెలుచుకున్న అతి పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ నిలిచాడు.రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన వైభవ్ 16 మ్యాచ్‌లలో ఐదు అర్ధశతకాలు, ఒక శతకంతో సహా 776 పరుగులు సాధించాడు. స్పోర్ట్స్ యాంకర్ రిద్ధిమా పాఠక్ వైభవ్ అద్భుత ప్రదర్శనను ప్రశంసిస్తూ, అతడిని బీహార్ అతిపెద్ద బ్రాండ్ అంబాసిడర్ అని అభివర్ణించారు. దీనికి సంబంధిన వీడియోని కూడా ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వైరల్ అవుతోంది.వైభవ్ సూర్యవంశీ బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా తాజ్‌పూర్ గ్రామానికి చెందినవాడు. అతను బీహార్ తరఫున దేశీయ క్రికెట్ ఆడతాడు. అయితే ఈసారి ఐపీఎల్‌లో తన విజృంభణ చూపించడంతో పిల్లాడు కాస్తా క్రికెట్ పిడుగు అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. క్రికెట్ లెజెండ్స్, సెలబ్రిటీలు సైతం ఈ కుర్రాడి ఆటతీరు, రికార్డులు బద్దలు కొట్టడంపై స్పందించారు. బీహార్‌కు అంతర్జాతీయంగా కీర్తిని తెచ్చిపెట్టిన వైభవ్ గురించి తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో రిద్ధిమా పాఠక్ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేశారు. చిన్నప్పుడు స్కూల్లోనూ, కాలేజీలోనూ 'మీరు ఎక్కడి నుండి వచ్చారు?' అని మమ్మల్ని అడిగినప్పుడు, మేము బీహార్ వాసులమని చెప్పడానికి సంకోచించేవాళ్ళమని కాని ఇప్పుడు గర్వంగా ఉందని చెప్పుకొచ్చింది. ఎందుకంటే లాలూ ప్రసాద్ యాదవ్ బీహార్‌కు అలాంటి ఇమేజ్ ఏదీ ఇవ్వలేదు. కానీ ఆ తర్వాత రెండు అద్భుతమైన విషయాలు జరిగాయి. మొదటిది మహేంద్ర సింగ్ ధోని, రెండవది, 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' సినిమా. ఈ రెండూ బీహారీలలో కొంత ఉత్సాహాన్ని నింపాయి.కానీ దీని వల్ల వచ్చిన మంచి ప్రచారం మొత్తం బీహార్ నుండి విడిపోయి కొత్త రాష్ట్రంగా ఏర్పడిన జార్ఖండ్‌కు చేరిందని పాఠక్ తెలిపారు. అయితే ఇప్పుడు ముందుకు వచ్చిన వ్యక్తి వైభవ్ సూర్యవంశీ. అతను పూర్తిస్థాయి బీహారీ. ఇప్పుడు తాను బీహారీ అని చెప్పుకోవడానికి ఏ బీహారీ కూడా సిగ్గుపడటం లేదని గర్వపడుతున్నామని చెప్పుకొచ్చింది. ఆమె మాటల్లో ఆనందం, ముఖంలో గర్వం చూస్తుంటే వైభవ్ సూర్యవంశీని విపరీతంగా అభిమానిస్తున్నట్లుగా కనిపిస్తోంది. స్పోర్ట్స్ యాంకర్ రిధిమా పాఠక్ ఎవరు..?రిధిమా పాఠక్ స్వస్థలం జార్ఖండ్. ఆమె తండ్రి పేరు సురేష్ కుమార్ పాఠక్, ఆయన సైన్యంలో పనిచేశారు.

Printed, published and edited by Makam Gangadhar H. No. 11-5-565, Bhagyalaxmi Towers, Venkateswara Colony, saroornagar, Ranga Reddy Dist. 500 035. T. GOwened by Makam Gangadhar and Printed at Ratna Graphics, H. No. 2-3-703/7, Tirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500013 T. G.H. No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Rangareddy Dist. 500 035. T. G. Editor & Managing Director : Makam Gangadhar +919393446188, PRGI No. TGTEL/2026/A1889